పేదల అభ్యుదయమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే
- దీర్ఘకాలిక సమస్యలపై దృష్టిసారించాం
- శరవేగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని చేయలేం
- సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



వడ్డేశ్వరం చెరువు సెంటర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: పేదల అభ్యుదయమే వైఎస్సార్ సీపీ లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం చెరువు సెంటర్‌లో దీర్ఘకాలికంగా ఉన్న రహదారి సమస్యను పరిష్కరిస్తూ సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి, నిధులు కేటాయించారని తెలిపారు. ప్రతి ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేస్తున్నామని, ఎంటీఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.8.5 లక్షలు కేటాయించి చెరువు సెంటర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, రెండు మూడు రోజుల్లో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న మహిళలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కు విద్యుత్ స్తంభాలు లేవని, వాటిని ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బుధవారం సాయంత్రానికి చెరువు సెంటర్‌లో రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం పలు సమస్యలను ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి అవకాశం ఉన్నంతవరకు న్యాయం జరిగే విధంగా ప్రయత్నాలు చేస్తామని, చట్టవిరుద్ధంగా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులను చేయలేమని చెప్పారు. పేద ప్రజలు ఇళ్ల స్థలాల గురించి అడిగారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంటీఎంసీ పరిధిలోని 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాజధాని పరిధిలో ప్లాట్లు ఏర్పాటు చేస్తే అక్కడ పేద ప్రజలు ఉంటే సమతుల్యత దెబ్బతింటుందని, పేద ప్రజలు ఈ ప్రాంతంలో ఇళ్లు ఇవ్వడానికి వీలు లేదంటూ రైతుల ముసుగులో కోర్టును ఆశ్రయించారని, అందుకే ఇళ్ల స్థలాలు కేటాయించలేకపోయామని, కోర్టులో పోరాటం చేస్తున్నామని, త్వరలోనే నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, అమరా నాగయ్య, బీసీ సెల్ నియోజకవర్గ నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వడ్డేశ్వరం పార్టీ అధ్యక్షులు గొడవర్తి శ్రీనివాసరావు, నాయకులు ఎస్.కె.మీరాషా, షేక్ బాబూ సాహెబ్, అన్నపురెడ్డి రాము, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం : ఎమ్మెల్యే ఆర్కే



శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ

మంగళగిరి: నగరంలోని ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొనియాడారు. ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి నగరంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందించిన పలువురు దాతలకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు సత్కరించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దాతల సహకారంలో ఆలయం మొత్తం చింతామణి రాయితో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయడంతోపాటు గర్భగుడిలో కొన్ని అభివృద్ధి పనులు, డ్రైనేజి పనులు పూర్తి చేసిన పాలక మండలి సభ్యులను అభినందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేసిన దాతలను ఎమ్మెల్యే ఆర్కే అభినందించారు. ఆలయంలో భజంత్రీలు వాయించే కళాకారులకు ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జేవీ నారాయణ, కమిటీ చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీరాధిక, కమిటీ సభ్యులు కొల్లి బాబూరావు, కొల్లి మునలారెడ్డి, అద్దంకి వెంకటేశ్వర్లు, వకుళాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, బేతపూడి నర్సయ్య, కుంచాల కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్వరికొండపై చర్చి నిర్మాణానికి సహకరిస్తా..

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- అనంతవరంలో పర్యటన
- అభివృద్ధి పనులు పరిశీలన



గ్రామస్తులతో చర్చించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: కల్వరికొండపై చర్చి నిర్మాణానికి త్వరలో అనుమతులు ఇప్పించి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చెప్పారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పర్యటించారు. తొలుత ఎస్సీ కాలనీలోని కల్వరి కొండ చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్థానికులతో చర్చించారు. కల్వరి కొండపై చర్చి నిర్మాణానికి ఎప్పటినుంచో అనుమతులు అడుగుతున్నప్పటికీ ఎవరూ స్పందించలేదని కాలనీ వాసులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్సీ కాలనీ వాసులు హర్షధ్వానాల మధ్య హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం అభివృద్ధి పనులను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకొని సానుకూలంగా స్పందించారు. గ్రామస్తుల నుంచి మంచి సానుకూల స్పందన లభించడంతోపాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరు కావడంతో ఎన్నికల సందడి ముందే వచ్చిందా అనే వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బత్తుల కిషోర్, నెక్కలు, తుళ్లూరు సొసైటీ చైర్మన్‌లు మున్నంగి కోటిరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, ఆరేపల్లి జోజి, బండ్ల శ్రీకాంత్, పోలు రమేష్, ఆలూరి శ్రీనివాసరావు, శృంగారపాటి సందీప్, తుమ్మూరు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

8న సాంస్కృతిక కార్యక్రమాలు



కళాజాగరణ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తాడేపల్లి విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి

తాడేపల్లిరూరల్: మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను జయప్రదం చేయాలని తాడేపల్లి విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ నిర్వాహకులు కోరారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాడేపల్లిలో మొట్టమొదటి సారిగా మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక గణేష్ కళామందిరం వద్ద ఏర్పాటు చేసిన కళావేదికపై జానపద నృత్యాలు, కోలాటాలు, కూచిపూడి, వెస్ట్రన్, పాటలు, పద్యాలు, ఏక పాత్రలు, అభ్యుదయ గీతాలు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో సాంప్రదాయ కళలైన చెక్క భజనలు, తోలుబొమ్మలాట, బుడబుక్కల వేషాలు, జానపద గీతాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో నాట్య తరంగిణి కూచిపూడి డాన్స్ ఇనిస్టిట్యూట్ నాట్యాచారిణి అనూష నాయుడు, భారతి నృత్యాలయం నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్ కుమార్, సిరిమువ్వ నృత్యనికేతన్ నాట్యాచారిణి ఉషా మాధవి, వివిధ పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, కోలాట గురువు దాలియా మహిళా బృందంచే కోలాట ప్రదర్శనలు, ఇంద్రజాలకులు ఆర్ ఆదినారాయణ ఇంద్రజాల ప్రదర్శనలు ఉంటాయని, తాడేపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఈ కార్యక్రమాలు వీక్షించి జయప్రదం చేయాలని కోరారు. అనంతం కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తాడేపల్లి విజ్ఞాన కేంద్రం గాదె సుబ్బారెడ్డి, రచయిత ఎస్. వెంకటరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్, యార్లగడ్డ సుబ్బారావు, కె.శేషయ్య, కొట్టి కరుణాకరరావు, పి.శ్రీలక్ష్మి, డి.కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తోటి బాలలకు మార్గదర్శకంగా ఉండాలి

ఎంఈఓ రమాదేవి



న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు రమాదేవి, లీలారాణి తదితరులు

ప్రత్తిపాడు: బాలల సంఘాలలో ఉన్న వారు చైతన్యవంతులై సమస్యల్లో ఉన్న తోటి బాలలకు మార్గదర్శకంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి రమాదేవి అన్నారు. ప్రపంచ బాలల హక్కుల ఒడంబడికలో పొందుపరచిన హక్కుల సాధనలో భాగంగా పారా సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో బాలల హక్కుల సంఘాలు ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం బాలల సంఘ సభ్యులు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారిని కలిసి, పారా సంస్థ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంఈఓ మాట్లాడారు. తమ పాఠశాలల్లో విద్యార్థులతో బాలల సంఘాలు ఏర్పాటుచేసుకుని, ప్రతి నెల సమావేశమై బాలలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చిస్తున్నామన్నారు. బాలల సంఘాల ఏర్పాటు మరియు మానవ హక్కుల విద్యా బోధనను పాఠ్య ప్రణాళికలో ఒక పాఠ్యాంశంగా చేర్చి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా తమ విన్నపాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని ఎంఈవోను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లీలారాణి, పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తురకా మంగయ్య, ఝాన్సీ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల మేధకు పదును



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చునని గుంటూరు తూర్పు ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం ప్రపంచ సుస్థిర శక్తి దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత, ఆసక్తి, పట్టుదలకు వారు రూపొందించిన ప్రాజెక్టులు అద్దం పడుతున్నాయని అన్నారు. పాఠ్యాంశాలను చదవడంతో పాటు చదివిన అంశాలను అర్థం చేసుకుని, నమూనా ప్రాజెక్టులను రూపొందించడం ద్వారా విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రాణించగలరని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ మేకల శేషకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏటా సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్ర బాబు మాట్లాడుతూ ఇస్రో రాకెట్ లాంఛింగ్ మోటార్, ఇన్‌క్రెడిబుల్ ఇండియా, పునరుత్పత్తి వ్యవస్థ, యాసిడ్ రైన్, గుండె నమూనా, గ్లోబల్ వార్మింగ్, మానవ దేహం, డ్రిప్ ఇరిగేషన్, చంద్రయాన్ తదితర అద్భుతమైన ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాల్ కళ్యాణి, హెచ్‌ఎం మీనాక్షి, సాయి శ్రీకర్ పాల్గొన్నారు.

పన్నుదారులకు పురపాలిక తీపికబురు

- పన్నులపై వడ్డీని రద్దు చేస్తూ ఆదేశాలు
- ఈ నెల 31లోపు చెల్లించేవారికి రద్దు వర్తింపు
- పట్టణంలో 14 వేల మందికి రూ.ఏడు కోట్ల మేర లబ్ధి



పురపాలక సంఘంలో పన్నులు కట్టించుకుంటున్న ఉద్యోగులు

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం పరిధిలోని ఖాళీ స్థలాలు, ఇళ్ల పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పన్నులను ఇప్పటి వరకు చెల్లించకుండా ఉన్న వారికి పన్నులపై వడ్డీ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 31 లోపు ఇంటి, ఖాళీ స్థల పన్నులను ఒకేసారి లేదా వాయిదాల పద్ధతిలో చెల్లించిన వారికి ఇది వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో తెనాలి పట్టణంలోని 14 వేల మందికి రూ.ఏడు కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది.

తెనాలి పట్టణ పరిధిలో సుమారు 35,190 నివాస గృహాలు ఉన్నాయి. వీటికి తెనాలి పురపాలక సంఘ అధికారులు ఏడాదికి రెండు సార్లు పన్ను విధించి వసూలు చేస్తుంటారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఒకసారి, అక్టోబర్ నుంచి మార్చి వరకు మరోసారి పన్నులను విధించి వసూలు చేస్తుంటారు. పన్నుల రూపంలో ఏడాదికి రూ.15.78 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి సమకూరుతుంది. ఇది ఇలా ఉంటే తెనాలి పట్టణంలో 22 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.1.68 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

పన్నులపై వడ్డీ రద్దుకు ఆదేశాలు

తెనాలి పట్టణ పరిధిలోని 35,190 నివాస గృహాలకు గానూ పన్నులు పెండింగ్‌లో ఉన్న నివాసాలు 12,098 ఉన్నాయి. ఆయా నివాస గృహాల వారు ఇంటి పన్ను, వడ్డీతో కలిపి రూ.6.58 కోట్లు మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంది. అలాగే పట్టణంలో 20,702 ఖాళీ స్థలాలున్నాయి. వాటిలో ఇప్పటి వరకు 1782 స్థలాల యజమానులు పన్నులు చెల్లించలేదు. వీటి ద్వారా పన్ను, వడ్డీతో కలిపి మున్సిపాలిటీకి రూ.9.49 కోట్లు రావాల్సి ఉంది. మొండి బకాయిలు వసూలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 లోపు పన్నులు చెల్లిస్తే అలాంటి వారికి వడ్డీ రద్దు చేస్తామని శనివారం ప్రకటించింది.

14 వేల మందికి రూ.ఏడు కోట్ల మేర లబ్ధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పన్నులపై వడ్డీ మాఫీ ఆదేశాల వల్ల తెనాలి పట్టణంలో సుమారు 14 వేల మందికి లబ్ధి చేకూరనుంది. పట్టణంలో ఇప్పటి వరకు పన్నులు చెల్లించని 12,098 మంది ఇళ్ల యజమానులు, 1782 మంది కాళీ స్థల యజమానులకు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల వల్ల మేలు జరగనుంది. అసలు కాకుండా వడ్డీ కింద ఇంటి యజమానులు చెల్లించాల్సిన రూ.1.42 కోట్లు, ఖాళీ స్థలాల యజమానులు కట్టాల్సిన రూ.5.13 కోట్లు మాఫీ కానున్నాయి. మొత్తం మీద తెనాలి పట్టణంలోని సుమారు 17 వేల మందికి రూ.ఏడు కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

> **అవకాశాన్ని వినియోగించుకోండి**
>
> తెనాలి పట్టణ పరిధిలో ఇప్పటి వరకు పన్నులు చెల్లించని వారు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రద్దు అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఇంటి, ఖాళీ స్థలం పన్నులను ఒకేసారి లేదా వాయిదాల పద్ధతిలో ఈ నెల 31 లోపు చెల్లించి వడ్డీ మినహాయింపును పొందాలి. పురపాలక సంఘ కార్యాలయంలోని పన్నులు చెల్లింపు కేంద్రాలలో గానీ, వార్డు సచివాలయాలు లేదా ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించవచ్చు. –సోమశేఖర యాదవ్, రెవెన్యూ అధికారి, తెనాలి పురపాలక సంఘం

స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా నాగజ్యోతి



నాగజ్యోతిని అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థిని స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఏఎన్‌యూలో ఈనెల 2న నిర్వహించిన అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకాన్ని సాధించింది. సంగడిగుంటలోని కళాశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థిని టి. నాగజ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి, అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత పొందినట్లు చెప్పారు. తద్వారా స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా ఎంపికవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపుతున్న తమ విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ద్వారా తోటి విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి సుభద్ర, ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, సాంస్కృతిక విభాగ సమన్వయకర్త మధుసూదన్, చైతన్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

లారీని ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



సంఘటనాస్థలంలో విచారిస్తున్న పోలీసులు

ఫిరంగిపురం: ఆగి ఉన్న లారీని మిర్చి లోడుతో వెళుతున్న మినీ లారీ ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న రైతుకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల నుంచి మిర్చి లోడుతో గుంటూరు వెళుతున్న మినీలారీ వేములూరిపాడు గ్రామశివారులో ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో మినీ లారీలో ఉన్న బి.బాలునాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఓవర్ హెడ్ ట్యాంక్‌లు క్లీనింగ్



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రాంతంలో కార్పొరేషన్ సిబ్బంది మంగళవారం తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైప్‌లైన్ల క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌లో నీటిని ఖాళీ చేసి, బ్లీచింగ్‌తో శుభ్రపరిచారు. తాడేపల్లి పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో డైరెక్ట్ పంపింగ్ ఉండడంతో తాగునీటిని ఉపయోగించవద్దని అందరికీ తెలియజేసి పైపుల్లోకి బ్లీచింగ్ లిక్విడ్ పంపి పైప్‌లైన్ చివర ఏర్పాటు చేసిన డమ్మీలను తీసి క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం నుంచి తాగునీటిని సరఫరా చేశారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కృషి చేయాలి

ఎన్నికల నిర్వహణాధికారి ఎం గంగరాజు



తాడికొండ: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సిబ్బంది సమష్టిగా పనిచేయాలని ఎన్నికల నిర్వహణాధికారి ఎం గంగరాజు అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు ఉపయోగించే గదిని పరిశీలించిన ఆయన చాంబర్, ఆవరణతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించి వసతులు అడిగి తెలుసుకొని తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో అనురాధ, సీఐ సీహెచ్ ప్రభాకర్, సర్వేయర్ బాబురావు, ఆర్ఐ వంశీకృష్ణ, పలువురు వీఆర్వోలు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదపాలెం గ్రామంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే పలు అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా పెదపాలెంలో పర్యటించిన సందర్భంలో సీసీ రోడ్డు నిర్మాణం కావాలని స్థానికులు కోరడంతో స్పందించిన ఆయన తన సొంత నిధులు రూ.1.50 లక్షలు కేటాయించి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కేకు పెదపాలెం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సాంబశివరావు కుటుంబానికి అండగా ఉంటాం

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో గత నెల 26న హత్యకు గురైన నాలాది సాంబశివరావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మృతిని తల్లి విశ్రాంతమ్మ, సోదరుడు మునికుమార్, అక్క లావణ్యలతో కలెక్టర్ మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. మానిటరీ రిలీఫ్ ఫండ్ రూ.8.25 లక్షల్లో వెంటనే రూ.4,12,500 విడుదల చేస్తున్నామన్నారు. మిగితా డబ్బులు చార్జ్‌షీట్ దాఖలు చేయగానే అందిస్తామన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు విశ్రాంతమ్మకు పెన్షన్, ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకుని తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లి సెంటర్‌కు చెందిన ఎస్‌కె సలీమ్ తాడేపల్లి ఓల్డ్ టోల్‌గేట్ వద్ద బియ్యం ప్యాకింగ్‌కు ఉపయోగించే సంచిలో మద్యం బాటిళ్లు తీసుకువస్తున్నాడని సమాచారం రావడంతో సలీమ్‌ను ఆపి తనిఖీ చేయగా గోతాములో 40 క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయని, జరిగిన సంఘటనపై సలీమ్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కోటిఒక్కలింగాల క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 8వ తేదీ శుక్రవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి శనివారం సాయంత్రం 7గంటల వరకు 39 గంటలపాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మరకత లింగానికి ప్రత్యేక అభిషేకాలు, నర్మదా బాణలింగాలకు భక్తుల స్వహస్తాలతో పూజలు, లింగోద్భవ సమయంలో విశేషపూజలు, శివనామసంకీర్తనలు నిర్వహిస్తామని చెప్పారు. రెండురోజుల పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

నేటి నుంచి లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్య బుధవారం ఉదయం నుంచి నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. నగర పరిధిలోని గణపతినగర్ విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం ప్రారంభిస్తారని పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తాడికొండ మండల పరిషత్ సమావేశం

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతోపాటు వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

ఏఎన్‌యూతో సత్య ఇంపెక్స్ సంస్థ ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో గుంటూరుకు చెందిన చిల్లీస్ , సుగంధ ద్రవ్యాల ఎగుమతుల సంస్థ సత్య ఇంపెక్స్ లిమిటెడ్ మంగళవారం ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సత్య ఇంపెక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టి.రామకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఆ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఎంఓయూలో భాగంగా ఏఎన్‌యూ ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగంతో కలసి సత్య ఇంపెక్స్ కంపెనీ పలు విద్య, వ్యాపార రంగ శిక్షణ, నైపుణ్య పెంపొందింపు కార్యక్రమాలు నిర్వహించనుంది. ఎంబీఏ విద్యార్థులకు కోర్సు రూపకల్పన, సిలబస్ ఎంపిక చేయటం, ప్రాజెక్టు వర్క్ కేటాయించడం, ఉపన్యాస కార్యక్రమాలు, ఎగుమతులపై శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయాలపై ఈ అవగాహన ఒప్పందంలో పరస్పర సహకారం ఉంటుంది. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా చాలా అవసరం అన్నారు. నిరంతరం గుంటూరు నుంచి మిర్చి, సుగంధ ద్రవ్యాలతో పాటు ఆక్వా ఫుడ్స్ ను చైనా, మలేషియా, వియత్నాం, అమెరికా వంటి దేశాలకు ఎగుమతులు చేస్తున్న సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా అంశాల్లో నైపుణ్యం లభించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ చంద్ర , ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగాధిపతి ఆచార్య వి చంద్రశేఖరరావు, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు డాక్టర్ పి. విజయ వాణి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ వి.చక్రవర్తి, డాక్టర్ జి.ఉమ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు జోన్ పరిధిలోని ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరు జోన్‌ను విద్యాభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయుల సమష్టి సహకారం అవసరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్జేడీని కలిసిన వారిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.